క్లుప్తంగా

బైపాస్ ఫ్లైఓవర్ వద్ద వ్యక్తి మృతదేహం

అమలాపురం రూరల్: కామనగరువు బైపాస్ ఫ్లైఓవర్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని అమలాపురం తాలూకా పోలీసులు శనివారం గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి మేథాగార్డెన్‌కు చెందిన బత్తుల ఏడుకొండలు (61)గా స్థానికులు గుర్తించారు. గతంలో ఆయన ఆర్టీసీలో పని చేసినట్టు వారు తెలిపారు. కొద్దిరోజుల నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, ఈ నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. బైపాస్ సమీపంలో బహిర్భూమికి వెళ్లి ఏడుకొండలు మృతి చెందినట్టు గుర్తించామని తాలూకా పోలీసులు తెలిపారు.

చిరస్మరణీయుడు బాలనందన్

అమలాపురం టౌన్: సీఐటీయూ జాతీయ పూర్వ అధ్యక్షుడు ఇ.బాలనందన్ చిరస్మరణీయుడని సీఐటీయూ నాయకులు అన్నారు. బాలనందన్ శత జయంత్యుత్సవాలు స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల సీఐటీయూ నాయకత్వ వర్క్‌షాపు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఆల్ ఇండియా ఉప అధ్యక్షురాలు జి.బేబీరాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈనెల 12,13 తేదీల్లో శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, నూకల బలరామ్ తెలిపారు. సీఐటీయూ వర్క్‌షాపు ప్రారంభ సూచికగా ఆ సంస్థ జెండాను రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉభయ గోదావరి జిల్లాల నాయకులు డీఎన్‌డీవీడీ ప్రసాద్, వెంకట్, శేష బాబ్జి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ప్రసంగించారు.

27 అసిస్టెంట్ పోస్టులకు రాతపరీక్ష

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 27న నిర్వహించే రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు శనివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి జయశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే పరీక్ష కోసం యానాం–5, పుదుచ్చేరి–67, కారైకల్–11, మాహే–2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యానాంలో ఎంజీజీబీహెచ్ స్కూల్, మెట్టకూరు పీజేఎన్ హైస్కూల్, రాజీవ్‌గాంధీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్, రీజెన్సీ పబ్లిక్ స్కూల్, డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా మొత్తం 32,692 మంది పరీక్ష రాస్తారని తెలిపారు. 1,394 పరీక్ష గదులను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



పి.మల్లవరం ముత్యాలమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర చైత్ర పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మవారికి శనివారం క్షీరాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. చెలంకూరి సాదిత్య, సింధుజ దంపతులు అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసారు. ఆలయ కమిటీ చైర్మన్ విళ్ల సత్యన్నారాయణ, ప్రతినిధులు ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి గోవిందరావు, చెలంకూరి రామచంద్రరావు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో చండీ హోమం

అమలాపురం టౌన్: స్థానిక గారపాటివారి వీధిలో వేంచేసి ఉన్న కనకదుర్గ ఆలయంలో వార్షికోత్సవ పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో వైభవంగా చండీ హోమం నిర్వహించారు. యర్రంశెట్టి చిట్టిబాబు, పార్వతి దంపతుల ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: నల్లచెరువులో వేంచేసిన పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం స్వామివారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి నిర్వహించారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశా రు. వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రమాదంలో ప్రభుత్వ విద్యారంగం

- యానాంలో ప్రభుత్వ పాఠశాల మనుగడకు గండం
- ఏటా తగ్గుతున్న అడ్మిషన్లు
- 1:11 నిష్పత్తిలో ప్రతి 11 మంది విద్యార్థులకు ఒక టీచరు
- 25 స్కూళ్లు 2,041 మంది విద్యార్థులు, 180 మంది టీచర్లు



మహాత్మాగాంధీ ప్రభుత్వ హైస్కూల్



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఇసుక కాలువ, యానాం

యానాం: భౌగోళికంగా ఉమ్మడి తూర్పుగోదావరిలో భాగంగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతం యానాంలో విద్యారంగం మనుగడ ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు లేకపోవడంతో దాని ప్రభావం ప్రభుత్వ విద్యారంగంపై పడుతుంది. దీంతో పాఠశాలలు, కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం అనేక అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అడ్మిషన్లు ఏటా గణనీయంగా తగ్గడం ఆందోళన కలిగిస్తోందని పలువురు టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే విద్యార్థుల సంఖ్య తగ్గి స్కూళ్లను ఎత్తివేసే ప్రమాదముందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పలువురు అంటున్నారు.

అనేక సంక్షేమ పథకాలు అమలు

యానాం ప్రభుత్వం అనేక పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా ప్రభుత్వ స్కూళ్లలో ఏటా అడ్మిషన్లు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థుల కోసం 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉదయం పాలు, స్నాక్స్‌తో పాటు ప్రతిరోజు గుడ్డుతో మధ్యాహ్న భోజనం, యూనిఫాం, సైకిళ్లు, పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారు. ఆధునిక భవనాలు, డిజిటల్ తరగతి గదులు, మౌలిక వసతులు, దీనికి తోడు ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఎంబీబీఎస్ వంటి వైద్య విద్య కోర్సుల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఎస్సీ విద్యార్థులకు ట్యూషన్ ఫీజు ఇస్తుండటంతో వారు ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్నారు. ప్రభుత్వ టీచర్ల పిల్లలకు సంవత్సరానికి చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలెవెన్స్ ఏటా ఒక్కొక్కరికీ రూ.23వేలు అందిస్తున్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివించడంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.

టీచర్లు ఎక్కువ విద్యార్థుల సంఖ్య తక్కువ

యానాం మొత్తం 25 ప్రభుత్వ స్కూళ్లు ఉండగా అందులో 17 ప్రాథమిక పాఠశాలలు, 8 హైస్కూళ్లు ఉన్నాయి. వీటన్నింటిలో కలుపుకుని మొత్తం విద్యార్థుల సంఖ్య 2,041 మంది. వీరికి బోధించేందుకు 180 మంది టీచర్లు ఉన్నారు. ఇసుక కాలువ ప్రభుత్వ పాఠశాలలో 33 మంది విద్యార్థులుంటే ఆరుగురు టీచర్లు, అంబేడ్కర్ నగర్‌లో 25 మంది విద్యార్థులకు ఐదుగురు టీచర్లు, సీతారామ్‌నగర్‌లో 25 మందికి నలుగురు టీచర్లు, కనకాలపేటలో 71 మందికి ఆరుగురు, కేఎస్‌జీజీ 88 మందికి 8 మంది, ఎమ్‌జీజీ 79 మందికి 8 మంది, రాజీవ్‌గాంధీ స్కూల్లో 180 మందికి 16 మంది, మెట్టకూరులో 76 మందికి 8 మంది, భీమ్‌నగర్‌లో 47 మందికి ఐదుగురు టీచర్లు, అగ్రహారంలో 48 మందికి ఆరుగురు, జీఈఎమ్‌పీఎస్ స్కూల్లో 64 మందికి ఏడుగురు టీచర్లు ఇలా దాదాపు అన్ని పాఠశాలల్లో నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్య కంటే టీచర్లు ఎక్కువగా ఉన్నారు. జాతీయ విద్యాహక్కు చట్టం ప్రకారం 1:30 నిష్పత్తిలో అంటే 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. యానాంలో 1:11 నిష్పత్తిలో ఉంది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్ సిలబస్‌ను ఇంటర్మీడియట్ వరకు అమలు చేసేందుకు ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియపై టీచర్ల ఆందోళన

రేషనలైజేషన్ ప్రక్రియకు పుదుచ్చేరి విద్యాశాఖ ఒత్తిడి చేయడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల సంఖ్య కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువ రావడంతో రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని కొన్ని నెలలుగా పుదుచ్చేరి విద్యాశాఖ ఒత్తిడి తెస్తోంది. ఇది అమలు అయితే పాఠశాలల విలీనంతో పాటు ఎక్కువైన టీచర్లను వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న పుదుచ్చేరి, మాహే, కారైకల్ ప్రాంతాల్లోని స్కూళ్లకు బదిలీ చేస్తారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లు పెంచడానికి కృషి



ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి కృషి చేస్తున్నాం. గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన టీచర్లతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం ద్వారా వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది

– పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, విద్యాశాఖాధికారి

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులపై హర్షం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ప్రయాణికులు, ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌కు ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేయడంతో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రయాణికులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. వాటర్ ప్లాంట్ పనిచేయట్లేదని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగ సంఘం నాయకులు చింతా రంగప్రసాద్, పి.మణిరాజు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై డిపోలో కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, డీఎం చల్లా సత్యనారాయణమూర్తి సమస్యను పరిష్కరించారు. డిపోలో గ్యారేజ్ గేటు వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌కు ఆర్టీసీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు, ప్రయాణికులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

అల్లవరం: ఓడలరేవులో చమురు తవ్వకాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ యాజమాన్యంతో చర్చించి గ్రామస్తులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీ గంటి హరీష్ మాథూర్ అన్నారు. ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ 40 రోజులు నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని ఎంపీ హరీష్ శనివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ కార్యకలాపాల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. సిద్ధార్థ నగర్‌లో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు అంబేడ్కర్ కృషి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దాట్ల తదితరులు



వన్నెచింతలపూడి ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్‌కు నివాళిలర్పిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లరేవు: అణగారిన, దళిత వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి సమసమాజ స్థాపనకు తన జీవితాన్ని త్యాగం చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిదాయకంగా నిలిచారని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలో సుంకటరేవు గ్రామంలో భీమ్ సేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు ఉండ్రాజవరం మైత్రేయ, బుద్ధ విహార బౌద్ధ ధమ్మపీఠం అధ్యక్షుడు పూజ్యబంతే అనాలయా చేతులమీదుగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, శాసన సభ విప్ దాట్ల సుబ్బరాజు, భీమ్‌సేన యూత్ అధ్యక్షుడు దడాల సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, జెడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్‌సాగర్, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సంధ్యారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు జి.నాగ సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ ముత్యాల బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు.

సౌత్‌సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజనీర్ పర్యటన

యానాం: సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఇంజనీర్ పీఎస్ బ్రహ్మనందం శనివారం యానాంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్ఏఓ మునిస్వామిని మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసారు. అనంతరం పర్యాటక ప్రాంతాలైన ఫ్రెంచికాలం నాటి పురాతన రోమన్ కాథలిక్ చర్చి తదితర ప్రాంతాల్లో పర్యటించి గౌతమీ గోదావరిలో బోట్ షికారు చేసారు. కేంద్ర పాలిత ప్రాంతంగా యానాం ప్రాముఖ్యతను పాలిటెక్నిక్ కళాశాల సూపరిండెంట్ సాధనాల బాబు వివరించారు. యానాంలో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ సేవలను కొనసాగిస్తామని బ్రహ్మనందం ఆర్ఏఓ మునిస్వామికి వివరించారు.



ఆర్ఏఓ మునిస్వామిని కలిసిన సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ ఇంజనీర్ బ్రహ్మనందం

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

యానాం: డంపింగ్ యార్డు స్థల సమస్య పరిష్కరించకపోవడంతో పట్టణంలో నెల రోజుల నుంచి ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయిందని దుర్వాసనతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని నిరసిస్తూ శనివారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వద్ద అన్నాడీఎంకే యానాం శాఖ కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్ ఆధ్వర్యంలో వ్యాపారులు, పలువురు ప్రముఖులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించాలని, ప్రజారోగ్యంతో చెలగాటం వద్దని నినాదాలు చేశారు. అనంతరం మంచాల సత్యసాయికుమార్ మట్లాడుతూ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, మాగాపు సుబ్బారావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విష్ణువర్ధనరావు, పెసల వెంకటేష్, చెక్కల అరుణ్ కుమార్, వేగేశ్న చినరాజు పాల్గొన్నారు.



ఆర్ఏఓ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

వైభవంగా మీసాల వెంకన్న రథోత్సవం

తాళ్లరేవు: పి.మల్లవరంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారి రథోత్సవం, తీర్థం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ కేవీ వేణుగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు ఖండవిల్లి సీతారంగాచార్యులు, ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని రథం ఉంచి అశేష జనం నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పోలేకుర్రు, పి.మల్లవరం, గాడిమొగ, తాళ్లరేవు, యానాం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధూళిపూడి వెంకట సుబ్బారావు, ఉంగరాల బూరి బాబు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

సత్తాచాటిన గురుకులం విద్యార్థులు



పినపోతు నరేంద్ర శ్యామ్ (955, సీనియర్ ఇంటర్)



టి లక్కీ (456, జూనియర్ ఇంటర్)



ప్రియాంక (955, సీనియర్ ఇంటర్, ఎంపీసీ)

అల్లవరం: ఇంటర్మీడియట్ బోర్డు శనివారం ప్రకటించిన ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తమ సత్తాచాటి ఉత్తమ ఫలితలు సాధించారు. గోడిలోని బాలురు, బాలికుల గురుకులం విద్యార్థులు సత్తాచాటారు. బాలురు గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 56 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 84 శాతం ఉత్తీర్ణతతో 47 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 32 మంది విద్యార్థులకు 31 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పినపోతు నరేంద్రశ్యామ్ 955 మార్కులతో ప్రథమ స్థానం, 948 మార్కులతో కన్నీడి రమేష్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 456 మార్కులతో తరపట్ల లక్కీ ప్రథమ స్థానం, 441 మార్కులతో పొలమూరి అభిషయ్, 438 మార్కులతో పెయ్యల బాలాజీ తృతీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. బాలికల గురుకులంలో ఎంపీసీలో 955 మార్కులతో గోగు ప్రియాంక, బైపీసీలో 903 మార్కులతో పి.దుర్గభవాని ప్రథమ స్థానంలో నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో పి.హేయలత 455 మార్కులు, బైపీసీలో ఎస్.ఇందు 422 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ కిరణ్మయి తెలిపారు. మొదటి సంవత్సరంలో 92.5 శాతం, ద్వితీయ సంవత్సరంలో 98 శాతం ఉత్తీర్ణత సాధించామని ఆమె తెలిపారు.

గురుకుల పాఠశాలలో ఇంటర్ పరీక్షల్లో 80శాతం ఉత్తీర్ణత





పి.శ్రావణి జ్యోతి (924, బైపీసీ) సీహెచ్ మౌనిక (978,ఎంపీసీ)

ముమ్మిడివరం: తానేల్లంక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మొత్తం 50 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 40 మంది ఉత్తీర్ణులై 80 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. మొదటి సంవత్సరంలో 70 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 45 మంది ఉత్తీర్ణులు కావడంతో 64.28 శాతం ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం పి.శ్రావణి జ్యోతి (బైపీసీ) 924, సీహెచ్.మౌనిక (ఎంపీసీ) 978 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు.

53.22 శాతం ఉత్తీర్ణత



ఫణీంద్ర (ఎంపీసీ, 901)

ముమ్మిడివరం: స్థానిక డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్షల్లో 53.22 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రశాంతి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 62 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 33 మంది ఉత్తీర్ణులు కావడంతో 53.22 శాతం ఫలితాలు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మొత్తం 87 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 42 మంది ఉత్తీర్ణులై 48.27 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఫణీంద్ర (ఎంపీసీ) 901 మార్కులు, ఎ.అనూష (సీఈసీ) 887, నాటి శాలిని (బైపీసీ) 827 మార్కులు సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

అమలాపురం టౌన్: ప్రభుత్వ బాలికల కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 56 శాతం, సీనియర్ ఇంటర్‌లో 82 శాతం ఉత్తీర్ణ సాధించినట్టు ప్రిన్సిపాల్ డి.కృష్ణ కిషోర్ తెలిపారు. ద్వితీయ ఇంటర్ ఎంపీసీలో సుదీప్తి 934, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని డి.రత్నశ్రీ 450 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థిని తాడి రీనా జాస్మిన్ 400, సీఈసీ విద్యార్థిని నల్లా అనూష 450 మార్కులు, ఇంటర్మీడియట్ ఒకేషనల్‌లో ఓఏఎస్ విద్యార్థిని కడలి లక్ష్మీ ప్రసన్న 924 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

యానాంలో 76 శాతం ఉత్తీర్ణత

యానాం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో యానాం రీజియన్‌లో 76 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. శనివారం విడుదలైన ఫలితాల్లో రీజెన్సీ జూనియర్ కాలేజీ ప్రథమ సంవత్సరంలో 245 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 76 శాతం ఉత్తీర్ణతతో 186 మంది ఉత్తీర్ణత సాధించారని ద్వితీయ ఇంటర్‌లో 271 మంది పరీక్షకు హాజరుకాగా 207 మంది ఉత్తీర్ణత సాధించడంతో 76 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్ తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో మెల్లం ప్రసాద్, పి లోకేశ్వర్ 463 మార్కులు సాధించి రీజియన్ ప్రథమస్థానంలో, సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో గేయామృత 984 మార్కులు సాధించారని తెలిపారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

74.41 శాతం ఉత్తీర్ణత

తాళ్లరేవు: స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 74.41 శాతం, ప్రథమ సంవత్సరంలో 36.53 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ద్వితీయ ఇంటర్‌లో బైపీసీ విద్యార్థిని పితాని వీరమల్లిక 925 మార్కులతో టాపర్‌గా నిలిచింది. రెడ్డి అనూష (ఎంపీసీ) 908, పి.వీర వెంకటలక్ష్మి (సీఈసీ) 890, జి.కీర్తి (హెచ్ఈసీ) 777 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో సంగాడి నాగేశ్వరి (ఎంపీసీ) 413 మార్కులతో కాలేజీ టాపర్‌గా నిలిచినట్టు తెలిపారు.



పితాని వీరమల్లిక (925, బైపీసీ)

సాకుర్రు ఉన్నత పాఠశాలకు కుర్చీల వితరణ

అమలాపురం రూరల్: సాకుర్రు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామ పెద్దలతో ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల బాబూరావు అధ్యక్షత సమావేశం జరిగింది. సర్పంచ్ గుత్తుల చిరంజీవి రావు, మాజీ సర్పంచ్‌లు ములపర్తి సత్యనారాయణ, చొల్లంగి సాయిబాబు, ఆకుల సత్యనారాయణ గ్రామ పెద్దలు పి. కృష్ణారావు, అజ్జరపు శేషగిరిరావు పాల్గొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్ 100 శాతం ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేయాలని తీర్మానించినట్టు ఉపాధ్యాయుడు పోతంశెట్టి దొరబాబు తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే రెగ్యులర్ ప్రధానోపాధ్యాయ పోస్టు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టు మంజూరవుతాయని తెలిపారు. వేదుల సునీల్ పేరున ఆయన తండ్రి వేదుల సోమసుందరం 40 కుర్చీలను అజ్జరపు శేషగిరి ద్వారా పాఠశాలకు అందించారు. ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు జనిపెల్ల భీమారావు హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఎస్ పల్లంరాజు కుడుపూడి విజయ లక్ష్మి, జల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'అక్షయ పాత్ర' చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్: అమలాపురం ఎర్ర వంతెన–నల్ల వంతన మధ్య గల బైపాస్ రోడ్డులోని శ్రీ దక్షిణేశ్వర శక్తి స్థల్ వద్ద శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం నుంచి చలివేంద్రం ప్రారంభమైంది. రేపాక సత్యనారాయణ మూర్తి (చిన్నా), వాణి కల్పన దంపతులు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగ, కూలింగ్ వాటర్‌తో పాటు రాగి జావ, షర్బత్ పంపిణీ చేశారు. అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు పోతురాజు నాగ కనకదుర్గ, ప్రతినిధులు నూకల కుమారి, ప్రసాద్, నందు, స్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి కన్నుల పండువగా చక్రస్నానం



వేంకటేశ్వరస్వామి దేవస్థానం కోనేరులో స్వామి వారికి చక్రస్నానం

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారికి చక్రస్నానం, పూర్ణాహుతి క్రతువులు శనివారం ఉదయం కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత అర్చక బృందం ఉదయం శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామాల స్మరణతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి దేవస్థానం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం కోనేరులో స్వామి వారి విగ్రహానికి, సుదర్శన చక్రానికి పవిత్ర స్నానం చేయించారు. అనేక మంది భక్తులు కూడా కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. పలువురు కోనేరు గట్టుపై నుంచి స్వామి వారి పవిత్ర చక్ర స్నానాన్ని వీక్షించారు. స్వామి వారి కల్యాణ కర్తలు యిండిగెల శ్రీనివాసరావు, పద్మావతి, యిండిగెల వీరభద్రరావు, నాగ రాధాకృష్ణకుమారి, యిండిగెల శివ రామ సూర్యవరప్రసాద్, కాంతాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, ఈవో యర్రా వెంకటేశ్వరరావు, అర్చకులు పెద్దింటి వెంకట నరసింహాచార్యులు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు తిక్కిరెడ్డి సురేష్ పాల్గొన్నారు.

నేడు స్వామి వారికి శ్రీ పుష్పోత్సవం: స్వామి కల్యాణోత్సవాల ముగింపు రోజైన ఆదివారం సాయంత్రం స్వామి వారికి పలు సేవలు చేయనున్నట్లు ఆలయ ఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. తిరుమంజన సేవ, బుక్కా ఉత్సవం, ఉయ్యాల సేవోత్సవం, పుష్పాలంకరణ, పుష్పోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.